సాక్షి చిత్తూరు

మంగళవారం । 29 । అక్టోబర్ । 2024




విన్నవించాం..పరిష్కరించండి సార్

జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జనం అర్జీలు అందజేశారు. - 10లో



పూల ధరలకు రెక్కలు

ఇటీవల కురిసిన వర్షాలకు పూలతోటలు దెబ్బతినడంతో ఇప్పుడు మార్కెట్‌లో పూలధరలు అమాంతం పెరిగాయి. - 10లో



జనారణ్యంలోకి నల్లముచ్చు

అటవీ ప్రాంతం నుంచి ఓ నల్లముచ్చు చౌడేపల్లి మండలంలోని గడ్డంవారిపల్లె రోడ్డు మార్గంలో జనాలకు కనిపించింది. - 10లో

న్యూస్‌రీల్

పీఠాధిపతులకు కాణిపాకం తీర్థ ప్రసాదాలు



పీఠాధిపతిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆలయ అధికారులు

కాణిపాకం: కలిగిరి కొండ ప్రాంతంలోని శ్రీదేవి, భూదేవి సమేత మహావిష్ణుమూర్తి ఆలయ కుంభాభిషేక పూజలకు విచ్చేసిన కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతికి కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం తరఫు అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు ఈఓ గురుప్రసాద్, ఏఈఓలు రవీంద్రబాబు, కోదండపాణిలు గణనాథుడి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వేదపండితులు, అర్చకులు పాల్గొన్నారు.

15న కార్తీక దీపోత్సవం

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి ఆలయానికి అనుబంధంగా ఉన్న మరగదాంబికా సమేత మణికంఠేశ్వరస్వామి ఆలయంలో నవంబర్ 15వ తేదీన కార్తీక దీపోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ గురుప్రసాద్ తెలిపారు. కార్తీక మాసం ప్రారంభం నుంచి ఆలయంలో ప్రతి సోమవారం అభిషేక పూజలు జరుగుతాయన్నారు. 15న దీపోత్సవం, గ్రామోత్సవం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

పెన్షన్ సమస్యలు ఉంటే తెలపండి

చిత్తూరు కలెక్టరేట్ : పెన్షన్ మంజూరులో ఏవైనా సమస్యలు ఉంటే తెలపాలని జిల్లా ఖజానా శాఖ అధికారి రామచంద్ర తెలిపారు. జిల్లాలో పెన్షన్ పొందుతున్న వారు తమ సమస్యలను లిఖిత పూర్వకంగా తెలియజేసి పరిష్కరించుకోవాలని కోరారు. 30వ తేదీ ఉదయం 11 గంటలకు కలెక్టరేట్‌లోని జిల్లా ఖజానా కార్యాలయంలో వినతుల స్వీకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుత్ గ్రీవెన్స్ రేపు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని అన్ని డివిజన్ కార్యాలయాల్లో బుధవారం విద్యుత్ గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. ఆయా డివిజన్ల వినియోగదారులు సమస్యలను తెలపాలన్నారు. వాటిని నమోదు చేసుకుని పరిష్కారం కోసం అధికారులు కృషి చేయనున్నట్లు చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి ఫిర్యాదులు తీసుకుంటారని వివరించారు.

అన్నదాత.. గుండెకోత



ఐరాల: ఎర్రంపల్లెలో దెబ్బతిన్న వరిపంట వద్ద రైతులు


ప్రకృతి వైపరీత్యాలు అత్యధికంగా వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తాయి. జిల్లాలో గత పక్షం రోజులుగా కురిసిన వర్షాలకు పంటలన్నీ నేలకొరిగాయి. కోతకు వచ్చిన పంట నీటిలో కొట్టుకుపోవడంతో రైతుకు గుండెకోత మిగిలింది. ఆరుగాలం శ్రమిస్తే కష్టాలు, నష్టాలే మిగిలాయి. పంట కోల్పోయి దిగాలుగా ఉన్న రైతులకు ప్రభుత్వం నుంచి చిల్లిగవ్వ సాయం అందలేదు. ఈ పంట నష్ట పరిహారానికి ప్రభుత్వం కనీసం హామీ కూడా ఇవ్వలేదు. ఇప్పటికే దగా పడిన హాలికుడు నష్టాల ఊబి నుంచి బయటపడే మార్గం కోసం దిక్కులు చూస్తున్నాడు.

- కోతకొచ్చిన పంట నీళ్లపాలు
- వరుస వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం
- 107 హెక్టార్ల వరి, 9 హెక్టార్ల వేరుశనగ నేలమట్టం
- దెబ్బతిన్న 70 ఎకరాల కూరగాయ పంటలు
- ప్రభుత్వ నుంచి అందని సాయం.. భరోసా

చిత్తూరు అర్బన్: నైరుతి రుతుపవనాలు జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిపించకుండానే కనుమరుగైపోయాయి. రబీ సీజన్‌లో రైతాంగం చిన్నపాటి వర్షాలను నమ్ముకుని పంటను సాగుచేసుకుంటున్న వేళ అల్పపీడనాల రూపంలో ఇటీవల జిల్లాలో కురిసిన వర్షాలు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. వరుస వర్షాలతో రైతులు వేసుకున్న పంటలు చేతికి అందకుండా నీళ్లల్లో కలిసిపోయాయి. జిల్లావ్యాప్తంగా 16 మండలాల్లోని 62 గ్రామాల్లో అల్ప పీడన ప్రభావం పంటను నిలువునా ముంచేసింది. ప్రధానంగా చిత్తూరు, యాదమరి, ఐరాల, పెనుమూరు, కార్వేటినగరం, రొంపిచెర్ల, సదుం, ఎస్ఆర్ పురం, గంగాధరనెల్లూరు, తవణంపల్లె, చౌడేపల్లె, వెదురుకుప్పం, కుప్పం మండలాల్లో 107 ఎకరాల్లో సాగుచేసిన వరి పంట, తొమ్మిది ఎకరాల్లోని వేరుశనగను రైతులు పూర్తిగా నష్టపోయారు. దీనికితోడు పులిచెర్లలో 13 ఎకరాల్లో టమాట, నాలుగు ఎకరాల్లోని కాకర, పుంగనూరులోని ఎనిమిది ఎకరాల్లో వేసిన కాలీఫ్లవర్, రొంపిచెర్లలో 22 ఎకరాలు, చౌడేపల్లె 3, బంగారుపాళెంలో టమాట పంట మొత్తం దెబ్బతింది.



యాదమరి: మోర్దానపల్లె గ్రామంలో నీటమునిగిన వరిపంట



చిత్తూరు : మండలంలో నేలకొరిగిన వరి పంటలను పరిశీలిస్తున్న రైతులు

అభయం ఇవ్వరా?

అకాల వర్షాలు, అల్పపీడనాల వల్ల జిల్లాలోని రైతులు ఆర్థికంగా ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. కోత సమయంలో ఉన్న పంటలు కొన్ని, కూరగాయల పంటలు మరికొన్ని వానకు కుదేలయ్యాయి. ఆర్థికంగా దెబ్బతిన్న రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం ఎలాంటి చొరవ చూపించలేదు. జిల్లాలోని ఏ ఒక్క రైతుకూ ఇప్పటి వరకు పంట నష్టం కింద చిల్లిగవ్వ కూడా అందకపోగా, రైతుల వద్దకు వెళ్లి పరిస్థితిని అడిగి తెలుసుకున్న అధికారి లేదా నాయకుడు కానీ కనిపించలేదు. 33 శాతం నిబంధనలను తొలగించి పంట కోల్పోయిన ప్రతి ఒక్కరికీ పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. పంట పూర్తిగా నష్టపోయినవాళ్లకు విత్తనాలు ఉచితంగా ఇవ్వాలని కోరుతున్నారు. ఇప్పటికే ఓ సీజన్ అయిపోయి, మరో సీజన్ ప్రారంభమైనా కూటమి ప్రభుత్వం నుంచి అన్నదాత సుఖీభవ పేరిట ఇవ్వాల్సిన పంటసాయంపై ఎలాంటి ప్రకటన రాలేదు. దీనిపై కర్షకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ దఫా జరిగిన పంట నష్టంపై ప్రభుత్వం ఇప్పటికైనా ప్రకటన చేయాలని కోరుతున్నారు.

లెక్క గడుతున్న అధికారులు

మరోవైపు అకాల వర్షాల నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా ఏర్పడిన పంటనష్టాన్ని అంచనా వేయడానికి జిల్లా యంత్రాంగం కసరత్తు ప్రారంభించింది. పడమటి మండలాల్లో ఇప్పటికే వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడుతున్నారు. ఏయే పంటలు, ఎంత విస్తీర్ణంలో నష్టపోయారు..? వాటి వివరాలను లెక్కగడుతున్నారు. ఈ నెల 27వ తేదీ వరకు పూర్తిస్థాయిలో పంట నష్టం అంచనాలు సిద్ధం చేసి, ఆపై ప్రభుత్వానికి నివేదిక పంపనున్నారు. అటు తరువాత ప్రభుత్వం నుంచి రైతులకు ఏమాత్రం పంట నష్ట పరిహారం అందుతుంది..? అసలు అందుతుందా..? లేదా..? అనే వివరాలు తెలియాల్సి ఉంది.

త్వరలోనే వివరాల వెల్లడి

“పంట నష్టంపై ఇప్పటికే మండలాల్లో మా అధికారులు, సిబ్బంది పరిశీలిస్తున్నారు. ఈ నెల 27వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో పరిశీలించి, రైతులతో మాట్లాడి నష్టపోయిన మొత్తాన్ని అంచనా వేస్తాం. వచ్చేనెల 2వ తేదీన గ్రామ సభలు నిర్వహించి సోషల్ ఆడిట్‌లో నష్టపోయిన రైతుల వివరాలను వెల్లడిస్తాం. త్వరలోనే ప్రభుత్వం పరిహారం చెల్లిస్తుంది.

– మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ అధికారి, చిత్తూరు

ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు



బాధితులతో మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని చిత్తూరు ఎస్పీ మణికంఠ ఆదేశించారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 28 ఫిర్యాదులు అందాయి. చిత్తూరులోని పోలీసు ఆర్మ్డు రిజర్వు కార్యాలయంలో ఎస్పీ మణికంఠ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను పరిష్కరించడంలో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలన్నారు. ఇందులో పోలీసుల సమస్యలు, కుటుంబ తగాదాలు, వేధింపులు, డబ్బు తగాదాలు, భూ తగాదాలు, ఆస్తి తగాదాలకు సంబంధించిన ఫిర్యాదులు ఉన్నాయి. వచ్చిన ప్రతీ ఫిర్యాదుపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు దరఖాస్తులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): 104లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా పని చేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మేనేజర్ ప్రతాప్ తెలిపారు. ఇందుకు డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి ఉన్నవారు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లతో చిత్తూరు నగరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని 104, 108 కార్యాలయంలో నవంబర్ 1, 2 తేదీల్లో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

అండర్–14 క్రికెట్ జట్టు ఎంపిక



జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన క్రికెట్ జట్టు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని మెసానికల్ మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రికెట్ అండర్–14 ఎంపిక పోటీలు నిర్వహించినట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ వసంతవాణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ క్రికెట్ ఎంపిక పోటీలకు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి క్రీడాకారులు పాల్గొన్నారని, ఇందులో విద్యార్థులు ప్రతిభ సాధించారని చెప్పారు. అందులో పీవీ నిహార్, రెహమాన్, తరుణ్‌కుమార్ (పలమనేరు), ఇజహార్ (కల్లూరు), చరణ్ నాయక్ (మదనపల్లె), మణిదీప్, గురుచరణ్, ధనుష్, సాయి, లిఖిత్‌సాయి, గోవర్ధన్(చిత్తూరు), రక్షిత్ సాయి, మోహిత్ సాయి (తిరుపతి), కన్నన్, హజిత్ (శ్రీకాళహస్తి), కమర్‌దోని (మదనపల్లె) ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారుల జట్టు నవంబర్‌లో అమలాపురంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని ఆమె చెప్పారు.

పేట్రేగుతున్న మొబైల్ హ్యాకర్లు



సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకూ కొత్త పుంతలు తొక్కుతోంది. అరచేతిలోనే ప్రపంచాన్ని చూపిస్తోంది. స్మార్ట్ ఫోన్ల రాకతో ఇంటి వద్దనుంచే అన్ని పనులు చక్కబెట్టుకునే అవకాశాలు కలిగాయి. ఈ సాంకేతికతను కొందరు దుర్వినియోగం చేస్తున్నారు. ఏపీకే యాప్‌లు, ఎస్ఎంఎస్‌లు, లింకులు పంపించి స్మార్ట్ ఫోన్లను హ్యాక్ చేస్తున్నారు. మనకు తెలియకుండానే మొత్తం సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఇటీవల నెల వ్యవధిలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో వేలాదిమంది సెల్‌ఫోన్లు హ్యాకింగ్‌కు గురయ్యాయంటే హ్యాకర్లు ఎలా రెచ్చిపోతున్నారో అర్థం చేసుకోవచ్చు.

- వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌ల హ్యాక్
- కెమెరా, మైక్రోఫోన్లను సైతం గుప్పిట్లోకి తీసుకుంటున్న వైనం
- అప్రమత్తంగా ఉండాలంటున్న నిపుణులు
- మొబైల్ హ్యాక్ అయిందా లేదా చెక్ చేసుకోవాల్సిందే!
- గత నెలలో వేలాది మంది స్మార్ట్ ఫోన్లు హ్యాక్

- చిత్తూరు జిల్లాకు చెందిన ఒక విద్యార్థిని బెంగళూరులో చదువుకుంటోంది. ఆమె మొబైల్‌లో కెమెరా, మైక్రోఫోన్ హ్యాక్ అయ్యాయి. తనకు తెలియకుండానే ఫ్లాష్ లైట్ ఆన్ కావడం, కెమెరా పనిచేయడం లాంటివి గమనించింది. వెంటనే సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసింది.
- వి.కోటకు చెందిన ఒక స్టూడెంట్ స్మార్ట్ ఫోన్‌లో జీమెయిల్ హ్యాక్ అయింది. అతని మెయిల్‌కు వచ్చే ఎస్ఎంఎస్‌లు, పాస్‌వర్డ్‌ల ఆధారంగా రూ.పది వేల వరకు పోగొట్టుకున్నాడు. ఆపై అప్రమత్తమైన అతను తన ఫోన్‌లో సెట్టింగ్స్‌ను మార్చుకున్నాడు.
- చిత్తూరుకు చెందిన ఒక విద్యార్థిని రాత్రి పడుకునే ముందు తన ఫోన్‌ను ఆఫ్ చేసుకుంటుంది. పొద్దున లేచి చూడగానే రాత్రి ఉన్న 80 శాతం బ్యాటరీ చార్జింగ్ 20 శాతానికి వచ్చేసింది. బ్యాటరీ పోయిందేమోనని సెల్ మెకానిక్ వద్దకు వెళ్లగా ఫోన్ హ్యాక్ అయిందనే విషయం బయటపడింది.
- పలమనేరుకు చెందిన బాబు రోజుకు 2 జీబీతో మొబైల్‌కు రీచార్జ్ చేసుకున్నాడు. తాను పెద్దగా వాడకపోయినా మొబైల్ డేటా లాస్ అవుతోంది. ఎక్స్‌పర్ట్స్ వద్దకు వెళ్లగా అతని మొబైల్‌ను బయటి దేశం వ్యక్తులు హ్యాక్ చేసి దాన్ని బిట్‌కాయిన్, క్రిప్టో కరెన్సీ కోసం వాడుతున్నట్లు తేలింది. ఇలాంటి సంఘటనలు నిత్యం జరుగుతున్నా చాలామందికి తెలియక, తెలిసినా సమస్యను ఎలా పరిష్కారం చేసుకోవాలో అర్థంగాక ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

పలమనేరు : ప్రస్తుతం స్మార్ట్ ఫోన్లు రాజ్యమేలుతున్నాయి. బ్యాంక్ లావాదేవీలతోపాటు అనేక సేవలు ఇంటి నుంచే పొందే అవకాశమూ కలిగింది. అంతేగాక సోషల్ మీడియా వేదికలు ఎన్నో వచ్చాయి. ముఖ్యంగా వాట్సాప్, ఫేస్‌బుక్, షేర్‌చాట్, ఇన్‌స్టాగ్రామ్, టెలీగ్రామ్, ట్విట్టర్ (ఎక్స్) ఇలా ఎన్నో యాప్‌లను యువతీయువకులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. వాటి ద్వారా సమాచాన్ని స్నేహితులు, బంధువులకు పంపించుకుంటూ ఉంటారు. ఈ క్రమంలోనే హ్యాకర్లు విజృంభిస్తున్నారు. ఏపీకే ఫైళ్లు, టెక్స్ట్ మెసేజ్‌లు పంపించి ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వాట్సాప్‌కు వచ్చే పలురకాల బ్యాంకింగ్ యాప్స్ ద్వారా, లోన్ వచ్చిందంటూ వచ్చే ఎస్ఎంఎస్‌ల కింద మనకు తెలియకుండా ఏపీకే బగ్ ఫైల్స్‌ను పంపిస్తున్నారు. వీటిని పొరబాటున టచ్ చేస్తే వెంటనే స్పైవేర్, మాల్‌వేర్ వైరస్ కనిపించకుండానే ఫోన్‌లో ఇన్‌స్టాల్ అయి మన సమాచారం మొత్తం మిర్రర్ సిస్టంలో హ్యాకర్లకు చేరుతోంది. ముఖ్యంగా ఫోన్‌లోని పోర్న్ సైట్‌ల ద్వారా ఎక్కువగా ఇలాంటి హార్మ్‌ఫుల్ హ్యాకింగ్ వైరస్‌లు వస్తున్నట్లు నిపుణులు చెబుతున్నారు. మరోవైపు మనఫోన్‌ను అపరిచిత వ్యక్తులకు ఇచ్చినప్పుడు వాళ్లు నిమిషం వ్యవధిలో మన ఫోన్‌లో ఏపీకేను ఇన్‌స్టాల్ చేసే అవకాశం ఉంటుంది. ఇది ఎవరికీ కనిపించని యాప్. ఫోన్‌ను హ్యాక్ చేసిన తర్వాత మొబైల్‌లోని కెమెరాను, మైక్రోఫోన్‌ను మన ప్రమేయం లేకుండానే వినియోగించి మన వ్యక్తిగత వీడియోలు, ఫొటోలను సేకరిస్తారు. మొబైల్ యాక్సెస్‌లో లైవ్ లొకేషన్ ద్వారా మనం ఎక్కడ ఉన్నామో సులభంగా తెలుసుకుంటారు. దీన్ని మనం గుర్తించాలంటే మన కెమెరాను ఓపెన్ చేయగానే ఫోన్ పైభాగంలో గ్రీన్ డాట్ కనిపిస్తుంది. మైక్రోఫోన్ హ్యాక్ అయితే ఆరెంజ్ డాట్ కనిపిస్తుంది.

అంతంత మాత్రంగా సైబర్ సెల్ సేవలు

జిల్లాలో ఎలాంటి సైబర్ క్రైమ్‌లు జరిగినా వెంటనే సైబర్ సెల్ టోల్ ఫ్రీ నంబర్లకు ఫోన్ చేయాలని పోలీసులు సూచిస్తుంటారు. కానీ ఆ నంబర్లకు ఎన్నిసార్లు కాల్ చేసినా లైన్ దొరకదు. దొరికినా వారు చెప్పే నంబరుకు కాల్ చేసినా పలు సందర్భాల్లో ఉపయోగం పెద్దగా కనిపించడం లేదనే మాట బాధితుల నుంచి వినిపిస్తోంది.

హ్యాకింగ్‌ను ఇలా తెలుసుకోవచ్చు

మన ఫోన్‌లో డయలర్ ప్యాడ్‌ను ఓపెన్ చేసి స్టార్ ప్లాస్ 67 ప్లాస్ లేదా స్టార్ ప్లాస్ 21 ప్లాస్ లేదా స్టార్ ప్లాస్ 62 ప్లాస్‌ను నొక్కితే ఎంఐఎం కోడ్ డిస్‌ప్లే అవుతుంది. ఇందులో అన్ని కాలమ్స్ నాట్ ఫార్వార్డెడ్ అని కనిపిస్తే మనఫోన్ సురక్షితంగా ఉన్నట్టు. లేకుంటే హ్యాక్‌కు గురైనట్టు గుర్తించాలి.

ఈ కోడ్‌లతో ఫోన్లు వస్తే లిఫ్ట్ చేస్తే గల్లంతే...

మన దేశానికి సంబంధించిన ఇంటర్నేషనల్ కోడ్ ప్లస్ 91 ఉంటుంది. ఈ మధ్య స్మార్ట్ ఫోన్లకు ప్లస్ 92, ప్లస్ 44, ప్లస్ 1, ప్లస్ 968 నంబర్ల నుంచి కాల్స్ వస్తున్నాయి. వీటిని పొరబాటున లిఫ్ట్ చేస్తే మన ఫోన్ సులభంగా హ్యాక్ అవుతుందని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

హ్యాకింగ్‌నుంచి బయటపడాలంటే..

ఫోన్ హ్యాక్ కాకుండా మన స్మార్ట్ ఫోన్‌లో ముందు కీప్యాడ్‌పై డబుల్ ప్లాస్ డబుల్ జీరో 2 ప్లాస్‌ను నొక్కాలి. దీంతో హ్యాకర్ల బారిన పడకుండా మన ఫోన్ రక్షింపబడుతుంది. కెమెరా హ్యాక్ అయితే కెమెరా సెట్టింగ్స్‌ను రీసెట్ చేసుకుని మెయిల్, పాస్ట్‌వర్డ్‌లను మార్చుకోవాలి. ముఖ్యంగా ఫోన్‌లోని యాప్ నోటిఫికేషన్లను పరిశీలించి అన్నింటి పర్మిషన్లు ఆపేయాలి. ఫేస్‌బుక్ హ్యాక్ అయితే ఫేస్‌బుక్ సెట్టింగ్స్‌లో ప్రైవసీ సెట్టింగ్స్, పర్సనల్ సెక్యూరిటీ, వేర్ యూ ఆర్ లాగ్డ్‌ను లాగ్ అవుట్ చేసుకుని ఫేస్‌బుక్‌ను డిలీట్ చేసి కొత్తగా ఇన్‌స్టాల్ చేసుకోవాలి. వాట్సాప్ హ్యాక్ అయితే పూర్తిగా ఫోన్‌ను ఫ్యాక్టరీ సెట్టింగ్స్‌లో అన్ ఇన్‌స్టాల్ చేసుకుని కొత్త మెయిల్, పాస్‌వర్డ్‌లతో కొత్త ఫోనులా మళ్లీ ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆపై వాట్సాప్‌ను ఇన్‌స్టాల్ చేసి టూస్టెప్ అథెంటికేషన్ చేసుకోవాలి. ఇక మెయిల్ హ్యాక్ అయితే పూర్తిగా మెయిల్‌ను డిలీట్ చేసి కొత్త మెయిల్‌తో లాగిన్ అవ్వాలి. దీన్ని తెలుసుకోవాలంటే డివైక్ డీటైల్స్‌లో గమనించాలి. ముఖ్యంగా మన ఫోన్‌ను కొత్తఫోన్‌లోకి మార్చినప్పుడు ఎక్కువగా మెయిల్‌ను హ్యాక్ చేసే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.

మీ ప్రమేయమే ప్రధానం..



“సాంకేతిక పరిజ్ఞాన్ని ఉపయోగించి సైబర్ నేరగాళ్లు ఫోన్లలోకి చొరబడుతున్నారు. మన అనుమతి లేనిదే ఏ ఒక్కరూ మన ఫోన్‌ను హ్యాక్ చేయలేరనే విషయాన్ని గుర్తించుకోవాలి. బ్యాంకు సేవలు, టెలికామ్ పేరిట ఫోన్లకు లింకులు, ప్రీ–రికార్డింగ్ వీడియో మెసేజ్‌లు, ఎస్ఎంఎస్‌లను, లింకులు పంపిస్తారు. వాటిని క్లిక్ చేస్తే వైరస్ ద్వారా మన ఫోన్ ఆపరేటింగ్ మోసగాడి చేతికి వెళ్లిపోతుంది. అనవసరమైన లింకులపై క్లిక్ చేయకూడదు. మెసేజ్‌లు ఓపెన్ చేయకుండా ఉండాలి. ఫోన్‌లో యాంటీ వైరస్ తప్పనిసరిగా ఇన్‌స్టాల్ చేసుకోవాలి. విదేశీ నంబర్ల నుంచి వచ్చే కాల్స్‌ను లిఫ్ట్ చేయొద్దు. ఇందులో అశ్లీల వీడియోలు పంపడం, మన ఫేస్‌ను కాపీ చేసి అశ్లీల వీడియోలు తయారుచేయడం చేస్తారు. స్మార్ట్ ఫోన్ వాడే ప్రతి ఒక్కరూ వీటిపై జాగ్రత్తగా ఉండాలి. సైబర్ సందేహాలకు, ఫిర్యాదులకు ఫోన్–1930, 9440900005 నంబర్లలో సంప్రదించాలి.

– మణికంఠ చందోలు, ఎస్పీ, చిత్తూరు

22వ సారి ఎస్పీ రక్తదానం



రక్తదానం చేస్తున్న చిత్తూరు ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: రోడ్డు ప్రమాదాలు, శస్త్ర చికిత్సల సమయంలో రక్తం అవసరం ఎలాంటిదో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఒక్కోసారి ఆపదలో ఉన్న వారికి రక్తం అందక చనిపోయే ప్రమాదం తలెత్తుతోంది. అయితే చిత్తూరు ఎస్పీ మణికంఠ సైతం రక్తదానంపై పాజిటివ్‌గా ఉంటారు. ఇప్పటివరకు ఆయన 22 సార్లు రక్తదానం చేశారు. పోలీసు అమర వీరుల వారోత్సవాలను పురస్కరించుకుని సోమవారం చిత్తూరులో మరోమారు రక్తదానం చేసి, రక్తదాన ఆవశ్యకతను సిబ్బందికి చాటి చెప్పారు.

క్లుప్తంగా

జనారణ్యంలోకి నల్లముచ్చు

చౌడేపల్లె: అటవీ ప్రాంతంలో నివశించే నల్లముచ్చుకోతి ఒకటి అడవుల్లో నుంచి దారి తప్పి చౌడేపల్లెకు వచ్చింది. సోమవారం గడ్డంవారిపల్లె రోడ్డు మార్గంలోని కోళ్లఫారం వద్ద ఒంటరి నల్లముచ్చుకోతి అరుస్తూ చూపరులను ఆకట్టుకుంటోంది. స్థానికులు సెల్‌ఫోన్లలో బంధిరచారు.

కర్ణాటక మద్యం సీజ్



పట్టుబడిన మద్యం, నిందితుల అరెస్టు చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

చిత్తూరు అర్బన్: అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని చిత్తూరు అర్బన్ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు అరెస్టు చేశారు. అర్బన్ సీఐ శ్రీహరిరెడ్డి కథనం మేరకు.. ఆదివారం చిత్తూరు రూరల్ మండలంలోని కృష్ణాపురం ఒంటిల్లు వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించగా కె.శ్రీరాములు (52) ఇంట్లో 15 బాక్సుల కర్ణాటక మద్యం ఉండడాన్ని గుర్తించి, అరెస్టు చేశారు. నిందితుడికి మద్యం సరఫరా చేసిన మరో ఇద్దరిపై కూడా కేసు నమోదు చేశారు. నిందితున్ని సోమవారం న్యాయమూర్తి ఎదుట ప్రవేశపెట్టి, జడ్జి ఆదేశాలతో చిత్తూరు జిల్లా జైలుకు తరలించారు. దాడుల్లో ఎస్‌ఐలు మోహనకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పంటలపై ఏనుగుల దాడి



అరటి పంటను తొక్కేసిన ఏనుగులు

కల్లూరు(పులిచెర్ల): పులిచెర్ల మండలంలోని ఆవుల పెద్దిరెడ్డిగారిపల్లెలో సోమవారం తెల్లవారుజామున ఏనుగులు పంట పొలాలను ధ్వంసం చేశాయి. దీంతో రైతులకు తీరని నష్టం వాటిల్లింది. ముఖ్యంగా కోత దశలో ఉన్న వరిపంటను పూర్తిగా తొక్కేసి నష్టం కలిగించాయి. అలాగే అరటి తోటలను కూడా విరిచేశాయి. ప్రతి రోజు ఎక్కడో ఒకచోట ఏనుగులు పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు వాపోతున్నారు.

గంజాయి కేసులో డిగ్రీ విద్యార్థి అరెస్టు

తిరుపతి రూరల్: గంజాయి సేవించడమే కాకుండా అక్రమంగా రవాణా చేస్తున్న డిగ్రీ విద్యార్థిని పోలీసులు అరెస్టు చేశారు. తిరుపతి రూరల్ సీఐ చిన్న గోవిందు కథనం మేరకు.. తిరుపతి రూరల్ వెంకటపతి నగర్ రైల్వే బ్రిడ్జి సమీపంలో సోమవారం పోలీస్, రెవెన్యూ అధికారులు తనిఖీ చేస్తుండగా ఇద్దరు పారిపోయారు. పోలీసులు వెంబడించి తాటితోపు గ్రామానికి చెందిన బీసీఏ ఫైనల్ ఇయర్ విద్యార్థిని అరెస్టు చేశారు. అతని నుంచి 150 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకుని, విచారించగా నగరికి చెందిన శివకుమార్ నుంచి కొనుగోలు చేసి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి, పరారీలో ఉన్న మరో వ్యక్తిని త్వరలోనే అరెస్టు చేస్తామని సీఐ తెలిపారు.

విన్నవించాం..
పరిష్కరించండి సార్

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు బారులు తీరిన బాధితులు
- 146 అర్జీల నమోదు
- సమస్యలు పరిష్కరించాలని బాధితుల వేడుకోలు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

మొత్తం అర్జీలు	146
ఎక్కువగా నమోదైంది రెవెన్యూ శాఖ	121
వెటర్నరీ శాఖ	05
నగరపాలక కమిషనర్, చిత్తూరు	04
పోలీసు శాఖ	04
జిల్లా విద్యాశాఖ	02
మిగిలిన శాఖలు	10



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు బాధితులు బారులు తీరారు. తమ సమస్యలను వినతుల రూపంలో నివేదించారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం అర్జీదారులతో కిక్కిరిసింది. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరి, డీఆర్‌ఓ పుల్లయ్య, ఆర్‌డీఓ శ్రీనివాసులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రధానంగా భూ సమస్యలు, పింఛన్లు, ఇళ్ల మంజూరు, రేషన్‌కార్డుల సమస్యలకు సంబంధించిన అర్జీలే ఎక్కువగా వచ్చాయి. అందిన వినతులను తక్షణమే ఆయా శాఖల అధికారులు పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని 57 విభాగాలకు గాను 146 అర్జీలు వచ్చాయని కలెక్టరేట్ ఏఓ కులశేఖర్ వివరించారు.

రోడ్డు లేకుండా చేస్తున్నారు సార్..

గంగాధరనెల్లూరు నియోజకవర్గం వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామంలో జగనన్న కాలనీలో ఉన్న 40 కుటుంబాలకు రోడ్డు మార్గం లేకుండా అడ్డుకుంటున్నారని కాలనీవాసులు ఈశ్వరయ్య, గోపి, కృష్ణయ్య వాపోయారు. ఈ మేరకు వారు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరుపేదలైన తమకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు ఇచ్చిందన్నారు. ఆ స్థలాల్లో తామంతా గృహాలు నిర్మించుకున్నామని తెలిపారు. తమ గ్రామంలో ఉన్న మురుగమ్మ కాలనీకి వెళ్లేందుకు దారి ఇవ్వకుండా దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. తమ సమస్యను తహసీల్దార్‌కు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు.



దారి సమస్య పరిష్కరించాలని కోరుతున్న మాంబేడు గ్రామస్తులు

పట్టాదారు పుస్తకాలు ఇవ్వండయ్యా..



పట్టాదారు పాస్‌బుక్ ఇప్పించాలని కోరుతున్న బాధితులు

తమ వ్యవసాయ భూములకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇవ్వాలని బంగారుపాళ్యం మండలం కోలావూరు ఎస్టీ కాలనీవాసులు చిన్నక్క, ప్రమీల కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ తాము చాలా ఏళ్లుగా సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూమికి పాసుపుస్తకం ఇవ్వాలని కోరారు. పాస్‌బుక్ కోసం పలుమార్లు అధికారులకు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేదన్నారు.



మదనపల్లె నుంచి చిత్తూరు కలెక్టరేట్‌కు ఆటోలో వచ్చిన వృద్ధురాలు



సమస్యను విన్నవించుకునేందుకు కలెక్టరేట్‌కు విచ్చేసిన వృద్ధురాలు లక్ష్మీదేవమ్మ

తిండిగింజలు లేవయ్యా..

''నడవాలంటే రెండు కాళ్లు లేవు. సొంత వాళ్లు ఎవరూ లేరు. పని చేసుకుందామంటే వయసు మళ్లింది. ఇంట్లో తినడానికి తిండిగింజలు లేవు. రేషన్‌కార్డు కూడా లేదు.. న్యాయం చెయ్యండయ్యా'' అంటూ నడవలేని స్థితిలో మదనపల్లెలోని వెంకటేశ్వర కాలనీకి చెందిన లక్ష్మీదేవమ్మ అనే వృద్ధురాలు అధికారులను ప్రాధేయపడింది. అయితే చిత్తూరు జిల్లా విడిపోయిందనే విషయం తెలియక ఆ వృద్ధురాలు అన్నమయ్య జిల్లా మదనపల్లె నుంచి చిత్తూరు కలెక్టరేట్‌కు విచ్చేసింది. ఓ వ్యక్తి తన ఆటోలో వృద్ధురాలిని చిత్తూరు కలెక్టరేట్‌కు తీసుకురాగా, అక్కడే ఉన్న ఐదుగురు వ్యక్తులు ఆమెను లోపలకు మోసుకెళ్లారు. ఈ విషయాన్ని దూరం నుంచే గమనించిన కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆ వృద్ధురాలి సమస్యను తెలుసుకోవాలని జాయింట్ కలెక్టర్ విద్యాధరిని పంపారు. బాధితురాలి సమస్య తెలుసుకున్న జేసీ, చిత్తూరు జిల్లా కాకపోవడంతో సమస్యను పరిష్కరించడం ఎలా అని కాసేపు ఆలోచించారు. తరువాత బాధితురాలి అర్జీ తీసుకుని మదనపల్లె సబ్‌కలెక్టర్‌కు పంపి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చి పంపారు.

రూ.15 వేలు పింఛన్ ఇప్పించాలి..



నేను బైరెడ్డిపల్లి మండలం బేలుపల్లి గ్రామం నుంచి కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చాను. గత 28 ఏళ్లుగా పూర్తి అంగవైకల్యంతో బాధ పడుతున్నాను. ఎక్కడికీ వెళ్లలేను. ఏ పని చేయలేను. పూర్తి అంగవైకల్యం వల్ల ఎలాంటి ఉపాధి లేదు. ప్రభుత్వం తనకు రూ.6 వేలు పింఛన్ ఇస్తోంది. పూర్తి అంగవైకల్యం ఉన్నందు వల్ల రూ.15 వేలు పింఛన్ ఇప్పించాలని కోరారు.

– లక్ష్మప్ప, బాధితుడు, బైరెడ్డిపల్లి

పింఛన్ ఇప్పించండయ్యా..



మాది గంగాధర నెల్లూరు మండలం జూపల్లి గ్రామం. వృద్ధాప్యం, అంగవైకల్యంతో బాధపడుతున్న నాకు ఎలాంటి జీవనోపాధి లేదు. 63 శాతం అంగవైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం ఉంది. వికలాంగ పింఛన్ కోసం చాలాసార్లు దరఖాస్తు చేసుకున్నాను. అయితే నా సమస్యను అధికారులు ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నిసార్లు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పింఛన్ ఇవ్వట్లేదు. కలెక్టర్ సారు పరిశీలించి న్యాయం చేయాలి.

– విమల, బాధితురాలు

పూజకు గోమూత్రం తీసుకెళ్తుండగా..



రోడ్డుపై మృతదేహం (ఇన్‌సెట్) చిరంజీవి (ఫైల్)



తండ్రి మృతదేహాన్ని చూసి విలపిస్తున్న కుమారుడు

- నగరి రామాపురం వద్ద సిమెంటు ట్యాంకర్ ఢీకొని వ్యక్తి మృతి
- నాలుగేళ్ల కిందట మృతుడి సోదరుడు సైతం ఇదే ప్రాంతంలో దుర్మరణం

నగరి : గోవులకు అరటి పండ్లు పెట్టి, పూజకు గోమూత్రం తీసుకెళ్తున్న ఓ వ్యక్తి మున్సిపల్ పరిధిలోని రామాపురం వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన సోమవారం వెలుగు చూసింది. వివరాలు.. నింద్ర మండలం ఇరుగువాయికి చెందిన చిరంజీవి(54) నగరిలోని టీఆర్ కండ్రిగ వద్ద అక్వేరియం దుకాణం నిర్వహిస్తున్నాడు. ఇతను ప్రతిరోజు డిగ్రీ కళాశాల మైదానంలో వాకింగ్ చేసి, అక్కడి నుంచి రామాపురానికి బైక్‌పై వెళ్లి అక్కడ ఆవులకు అరటి పండ్లు పెట్టి గోమూత్రం తీసుకువచ్చి ఇరుగువాయిలోని వినాయక స్వామికి పూజలు చేసి దుకాణానికి వస్తాడు. యథావిధిగా సోమవారం కూడా రామాపురం వద్ద గోమూత్రం తీసుకుని నగరి వైపు వస్తుండగా వెనుక వైపు నుంచి అతివేగంగా వచ్చిన సిమెంటు ట్యాంకర్ చిరంజీవిని ఢీకొట్టింది. దీంతో అతను ట్యాంకర్ లారీ టైరు కింద పడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సీఐ మహేశ్వర్ ఘటనాస్థలిని పరిశీలించి కేసు నమోదు చేశారు. ట్యాంకర్ డ్రైవర్ పరారీలో ఉన్నాడు. కాగా చిరంజీవికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. తండ్రి మరణవార్తతో సంఘటనా స్థలానికి వచ్చిన కుమారుడు ఛిద్రమైన మృతదేహాన్ని చూసి విలపించడం అక్కడ ఉన్న వారిని కలచివేసింది.

ఒకే ప్రాంతంలో అన్నదమ్ముల మరణం..

మృతుడు చిరంజీవి సోదరుడు టీచర్ బాబు కూడా నాలుగేళ్ల క్రితం రామాపురం వద్దే జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆ బాధ నుంచి కుటుంబం ఇప్పుడిప్పుడే బయటపడుతున్న తరుణంలో అదే ప్రాంతంలో చిరంజీవి కూడా మృతి చెందడం ఆ కుటుంబాన్ని కలచివేసింది. రెండు ప్రమాదాలు జరిగిన సమయంలో వారు నడిపిన వాహనం కూడా ఒకటే అని కుటుంబ సభ్యులు తెలిపారు.

నేడు ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా ముసాయిదా ఓటర్ల జాబితాను ఈ నెల 29వ తేదీన ప్రచురించనున్నారు. కలెక్టరేట్‌లో జాబితాను ప్రచురించేందుకు కలెక్టరేట్ అధికారులు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఎన్నికల సంఘం ఉత్తర్వుల మేరకు ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈ జాబితా ప్రకారం జిల్లాలో 15,66,502 మంది ఓటర్లు ఉన్నట్లు కలెక్టరేట్ అధికారులు నివేదికలు సిద్ధం చేశారు. ఇందులో పురుషులు 7,71,264, మహిళలు 7,95,165, ఇతరులు 73 మంది ఉన్నట్లు నివేదికల్లో పేర్కొన్నారు.

రోల్ అబ్జర్వర్‌గా వినయ్‌చంద్ ..

జిల్లా ఎలక్టోరల్ అబ్జర్వర్‌గా వినయ్‌చంద్‌ను నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం సీఈఓ వివేక్ యాదవ్ ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలో నిర్వహిస్తున్న స్పెషల్ సమ్మరి రివిజన్ కసరత్తును పర్యవేక్షించేందుకు రోల్ అబ్జర్వర్‌ను నియమించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ఆయనను చిత్తూరుతో పాటు తిరుపతి, అన్నమయ్య, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, కర్నూలు జిల్లాలకు రోల్ అబ్జర్వర్‌గా నియమించారు.

పూల ధరలకు రెక్కలు

- వర్షాలకు దెబ్బతిన్న పూలతోటలు
- దిగుబడి తగ్గడంతో అమాంతం పెరిగిన ధరలు
- బంతి పూలు కిలో రూ.40, చామంతి కిలో రూ.150
- ఆనందం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



వి.కోట మార్కెట్‌కు వచ్చిన బంతిపూలు

వి.కోట: దసరా ఆయుధ పూజ, దీపావళి పండుగ సందర్భంగా పూల ధరలకు రెక్కలు వచ్చాయి. సోమవారం వి.కోట పూల మార్కెట్‌లో కిలో చామంతి రూ.40 వరకు పలకగా, చామంతి అత్యధికంగా రూ.150 పలికాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల దసరా సమయంలో కురిసిన వర్షాలకు పూలతోటలు ధ్వంసం కావడంతో పాటు ధరలు కూడా పూర్తిగా తగ్గిపోయాయి. ప్రస్తుతం పూల దిగుబడి పెద్దగా లేకపోవడంతో ధరలు అమాంతం పెరిగాయి. సాధారణంగా కిలో రూ.50 నుంచి రూ.90 వరకు పలికే చామంతి ఈ ఏడాది రూ.150 వరకు గరిష్టంగా పలుకుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో సెంట్ వైట్ రకం చామంతి పూలు కిలో రూ.130 నుంచి 150 వరకు పలకగా, వైలెట్ రకం చామంతులు సైతం రూ.100 నుంచి రూ.150 వరకు పలికాయి.

వి.కోట నుంచి ఎగుమతి..

వి.కోట నుంచి విజయవాడ, హైదరాబాద్, తిరుపతి, శ్రీశైలం, రాజమండ్రి, భీమవరం, వైజాగ్, కోల్‌కతా, మధురై, తిరుచ్చి, మద్రాస్ తదితర ప్రాంతాలకు పూలను భారీగా ఎగుమతి చేస్తారు. దీపావళి వరకు ధరలు ఇలాగే ఉంటాయని, మరింత పెరిగే అవకాశాలు కూడా ఉన్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని ఆదేశాలు

- సాక్షి కథనానికి స్పందించిన విద్యాశాఖ కమిషనర్ కృతికా శుక్లా
- ఇంటర్ విద్యార్థులకు బస్సు సౌకర్యం కల్పించాలని కలెక్టర్లకు డీఓ లెటర్లు
- రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కళాశాలల ప్రిన్సిపల్స్‌కు ఆదేశం

~ Commissioner, Interm...
All Principals to note that RTC bus services in each district were to be rescheduled as per the revised college timings.. for this DO letter was already addressed to the Collectors..pl bring to my notice if your college is still facing problem in this regard for transportation of students.

విద్యాశాఖ కమిషనర్ పంపిన సందేశం

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్ విద్యార్థులకు కళాశాల సమయం పెంపు వల్ల ఇళ్లకు వెళ్లడానికి బస్సు సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వైనంపై సాక్షి దినపత్రికలో ఈ నెల 28న చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో 'కళాశాలల్లో గంట..బస్సులో తంటా', 'అదనపు గంట.. బస్సులదే తంటా' శీర్షికలతో కథనాలు ప్రచురితమయ్యాయి. ఈ కథనాలకు రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ కృతికాశుక్లా స్పందించారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న ఇంటర విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల సౌకర్యం ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్లకు డీఓ లెటర్లు పంపారు. విద్యార్థులకు ఉదయం 9 గంటలకు, సాయంత్రం 5 గంటలకు కచ్చితంగా ఆర్టీసీ బస్సులు అందుబాటులో ఉండేలా కలెక్టర్లు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇదే విషయాన్ని కమిషనర్ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్‌కు వాట్సాప్‌లో సందేశం పంపారు. సాక్షి కథనాల వల్ల రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు రవాణా సమస్య పరిష్కారమైంది.

రీజనల్ వర్క్ షాప్ ప్రారంభం



ప్రసంగిస్తున్న సర్వశిక్షా అభియాన్ పీఓ వెంకటరమణారెడ్డి

శాంతిపురం: మూడురోజుల పాటు జరిగే ప్రాంతీయ స్థాయి హబ్ అండ్ స్పోక్ అటల్ టీచర్స్ వర్క్ షాప్ కుతేగౌనిపల్లి వద్ద ఉన్న శ్రీ పరమహంస యోగానంద విద్యాలయలో సోమవారం ప్రారంభమైంది. సర్వశిక్షా అభియాన్ పీఓ వెంకటరమణారెడ్డి, డ్వామా పీడీ రవికుమార్ ప్రారంభించారు. తొలిరోజు పాఠశాలల్లో అటల్ అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల అవశ్యకత, ప్రయోజనాలు, ల్యాబ్‌ల విస్తరణను వక్తలు వివరించారు. ప్రాంతీయ మండలిలోని 12 జిల్లాల నుంచి ఎంపిక చేసిన 60 మంది ఉపాధ్యాయులు శిక్షణలో పాల్గొన్నారు. స్థానిక విద్యాలయ కరస్పాండెంట్ గోపాల్ అగర్వాల, ప్రిన్సిపల్ ఆజాద్ హుసేన్, డాక్టర్ బీఆర్ సురేష్‌బాబు ముఖ్య అతిథులుగా ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఆధార్ లింక్ అయిన వారికి ఉచిత సిలిండర్లు

చిత్తూరు కలెక్టరేట్: ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా బీపీఎల్ రేషన్‌కార్డు ఉండి ఆధార్ అనుసంధానం చేసుకున్న ప్రజలకు ఉచితంగా ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్ ఇవ్వనున్నామని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రతి ఆర్థిక సంవత్సరానికి మూడు ఉచిత సిలిండర్లు ఇస్తారన్నారు. ఈ పథకాన్ని ఈ నెల 31వ తేదీన సీఎం ప్రారంభిస్తారన్నారు. ఆ తర్వాత జిల్లాలో ఈ నెల 31వ తేదీ నుంచి మార్చి 31వ తేదీ వరకు గ్యాస్ రీఫిల్లింగ్‌కు నమోదు చేసుకున్న వారికి సిలిండర్లు అందిస్తారన్నారు. గ్యాస్ డెలివరీ సమయంలో బిల్లులో ఉన్న నగదును చెల్లించి సిలిండర్ పొందాలని, తరువాత రెండు రోజుల్లో సబ్సిడీ నగదు వినియోగదారుడి బ్యాంక్ ఖాతాలో జమచేస్తారని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

మోటర్ సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి

పుత్తూరు: మోటర్ సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్న ఓ వ్యక్తిని ఢీకొట్టడంతో మృతి చెందిన సంఘటన పుత్తూరు పట్టణంలో ఆదివారం రాత్రి చోటు చేసుకొంది. ఏఎస్‌ఐ భాస్కర్ కథనం మేరకు.. స్థానిక భవానీనగర్‌కు చెందిన ఎం.సుబ్రమణ్యంరెడ్డి కూలి పని ముగించుకుని ఇంటికి నడిచి వెళ్తుండగా స్థానిక స్వర్ణ లేఅవుట్ వద్ద తొరూరు గ్రామానికి చెందిన సుబ్రమణ్యం రెడ్డి పుత్తూరు నుంచి గ్రామానికి బైక్‌తో ఢీకొట్టాడు. ప్రమాదంలో సుబ్రమణ్యంరెడ్డి తీవ్ర గాయాలయ్యాయి. పుత్తూరు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎర్రచందనం కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు



యేసురత్నంరెడ్డి

తిరుపతి లీగల్: ఎర్రచందనం దుంగలను అక్రమంగా నిల్వ ఉంచిన కేసులో చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు మండలం నాగూరుపల్లికి చెందిన నాగూరు యేసురత్నంరెడ్డికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.6 లక్షల జరిమానా విధిస్తూ తిరుపతి రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ కోర్టు సెషన్స్ జడ్జి ఎ.నరసింహమూర్తి సోమవారం తీర్పు చెప్పారు. కోర్టు లైజనింగ్ ఆఫీసర్ హరిప్రసాద్ కథనం మేరకు.. 2017 జనవరి 6న అందిన సమాచారం మేరకు జీడీ నెల్లూరు పోలీసులు నాగూరుపల్లిలోని యేసురత్నంరెడ్డి ఇంటి పరిసరాల్లో తనిఖీ చేసి మూడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో పొలం పక్కన ఉన్న ఎర్రచందనం చెట్టును నరికి ఎక్కువ ధరకు విక్రయించాలని షెడ్‌లో భద్రపరిచినట్టు యేసురత్నంరెడ్డి తెలిపాడు. 65 కిలోలున్న దుంగలను పోలీసులు ఫారెస్ట్ అధికారులకు అప్పగించి అతనిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచారు. అతనిపై నేరం రుజువు కావడంతో జడ్జి శిక్ష విధించారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ నగేష్ వాదించారు.

తిరుపతి డీఎంహెచ్‌ఓపై విచారణ

చిత్తూరు రూరల్(కాణిపాకం): తిరుపతి డీఎం అండ్ హెచ్‌ఓ శ్రీహరిపై వచ్చిన ఆరోపణలపై అధికారులు సోమవారం చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఆయన ఉమ్మడి చిత్తూరు జిల్లా డీఎంఅండ్‌హెచ్‌ఓగా పనిచేసిన సమయంలో డెప్యుటేషన్‌లో ఉన్న వారితోపాటు ప్రైవేటు ఆస్పత్రుల నిర్వాహకుల నుంచి పెద్ద ఎత్తున వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తాయి. అంతేగాక ఆయన చేసిన అవినీతిపై కొందరు ఆకాశరామన్న ఉత్తరం రాశారు. దీనిపై రాష్ట్ర శాఖ అధికారులు స్పందించారు. గుంటూరు డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయలక్ష్మి, నెల్లూరు డీఎంఅండ్‌హెచ్‌ఓ పెంచులయ్యను విచారణ అధికారులుగా నియమించారు. ఈ క్రమంలో వారు కార్యాలయంలో 40 మంది అధికారులు, సిబ్బందిని విచారించారు. ఈ విచారణ రెండు రోజుల పాటు కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.

గ్రీవెన్స్‌లో బాధలు చెప్పుకోవడానికి వచ్చి..

- మంగళసూత్రం జార విడుచుకున్న మహిళ
- వినతిపత్రం రాసుకునేందుకు వెళ్తున్న మరో వ్యక్తికి దొరికిన బంగారు చైను
- పోలీసులకు అప్పగించి నిజాయితీ చాటుకున్న వైనం



ఎస్పీ సమక్షంలో బాధితురాలికి మంగళసూత్రం అప్పగిస్తున్న మురళి

చిత్తూరు అర్బన్: రోడ్డుపై వంద రూపాయల నోటు దొరికితేనే ఎవరూ చూడకముందే గబుక్కున జేబులో పెట్టుకుని వెళ్లే రోజులివి. అలాంటిది దాదాపు రూ.2.40 లక్షల విలువచేసే 30 గ్రాముల బంగారు గొలుసు దొరికిందో వ్యక్తికి. కానీ తనదికాని వస్తువును నిజాయితీగా పోలీసులకు అప్పగించిన ఘటన చిత్తూరు నగరంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. పుంగనూరుకు చెందిన మురళి తన గ్రామంలోని సమస్యను చెప్పుకోవడానికి సోమవారం చిత్తూరు కలెక్టరేట్ గ్రీవెన్స్‌కు వచ్చాడు. అర్జీ రాసుకోవడానికి వెళ్తుండగా తన కాళ్లకు ఓ గొలుసు తగిలింది. చూస్తే బంగారు మంగళసూత్రం. వెంటనే అతను అక్కడే డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్‌కు విషయం చెప్పి మంగళసూత్రం అప్పగించాడు. సదరు కానిస్టేబుల్ విషయాన్ని టూటౌన్ సీఐ నెట్టికంఠయ్యకు చెప్పడంతో ఆయన కలెక్టరేట్ కార్యాలయం వద్దకు వచ్చి విచారణ చేపట్టారు. గంగాధరనెల్లూరు మండలం అంబోదరపల్లెకు చెందిన పొన్నమ్మ తన కుటుంబ సమస్యలు చెప్పుకోవడానికి చిత్తూరు కలెక్టరేట్‌కు వచ్చారు. తనకు జరిగిన అన్యాయం గుర్తుకుతెచ్చుకుని ఏడుస్తూ, మెడలో ఉన్న బంగారు మంగళసూత్రాన్ని ఓ పర్సులో వేసుకుంటుండగా అది కింద పడిపోయింది. తీరా గొలుసుపోయిందని గుర్తించి ఏడుస్తూ తిరుగుతుండడంతో ఆమెను విచారించి గుర్తించారు. అనంతరం ఇద్దరినీ చిత్తూరు డీఎస్పీ సాయినాథ్‌తో కలిసి ఎస్పీ మణికంఠ వద్దకు తీసుకెళ్లారు. మురళీ చేతుల మీదుగా పొన్నమ్మకి బంగారు మంగళసూత్రాన్ని అప్పగించారు. నిజాయితీ చాటుకున్న మురళీకి సీఐ నెట్టికంఠయ్య తన వద్ద ఉన్న నగదును ఎస్పీ చేతుల మీదుగా ఇప్పించారు. మురళీని ఎస్పీని ప్రత్యేకంగా అభినందించారు.